వివాహ ఆహ్వాన పత్రిక అందజేత

బీఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంకే ముజీబుద్దీన్ కుమారుడి వివాహం ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరుగనున్నది. వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.
- కామారెడ్డి, ఫిబ్రవరి 7

నవోదయ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులతో సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, ఫిబ్రవరి 7: జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి, ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నేడు నిర్వహించనున్న ఎంట్రెన్స్ పరీక్షకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటర్మీడియట్ కోర్సు కోసం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, తొమ్మిదో తరగతిలో ఖాళీల భర్తీకి ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కామారెడ్డిలో 13, నిజాంసాగర్‌లో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి 1,739, ఇంటర్‌లో ప్రవేశం కోసం 2,103మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ జనార్దన్, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

బాన్సువాడ, ఫిబ్రవరి 7: రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాన్సువాడ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బాన్సువాడ సీఐ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం బాధ్యులు మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్న ఇటీవల సోషల్ మీడియాలో, వరంగల్ సభలో రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి.. రాజకీయ లబ్ధి కోసం రెడ్డి కులస్తులపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ రెడ్డి సంఘం అధ్యక్షుడు మాసాని అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాశం రాజిరెడ్డి, ర్యాల నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకట్రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, ర్యాల హన్మంత్‌రెడ్డి, పాశం గంగారెడ్డి, మాసాని రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ సీఐకి ఫిర్యాదుచేస్తున్న రెడ్డి సంఘం బాధ్యులు

నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బీబీపేట్ (దోమకొండ), ఫిబ్రవరి 7: నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం అంచనూర్, దోమకొండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన పరిశీలించారు. నర్సరీల్లోని బెడ్లలో ఉన్న మొక్కలను సంరక్షించాలన్నారు. అనంతరం అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్ పరిశీలించారు. మొక్కల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, ట్రీ గార్డులను ఏర్పాటుచేయాలని సంబంధిత గ్రామ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో రజిని, టీఏలు లింగం, రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

ప్రమాద స్పాట్ల పరిశీలన

భిక్కనూరు, ఫిబ్రవరి 7: జిల్లాలోని జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల స్పాట్లను అడిషనల్ ఎస్పీ చైతన్యారెడ్డి శుక్రవారం పరిశీలించారు. భిక్కనూరు మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయనే విషయాలను సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల్లో నివారణ చర్యలను చేపట్టాలని వారికి సూచనలు చేశారు.

సూచనలు ఇస్తున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

రోడ్డుపై గుంతల పూడ్చివేత

గుంతలను పూడ్చివేస్తున్న ఆటో డ్రైవర్లు

బీబీపేట్, ఫిబ్రవరి 7: బీబీపేట నుంచి ఇస్సానగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. బాగుచేయాలని కోరినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పలువురు ఆటో డ్రైవర్లు శుక్రవారం శ్రమదానం చేసి గుంతలను పూడ్చివేశారు. కార్యక్రమంలో ఉప్పర్‌పల్లి స్వామిగౌడ్, కమ్మరి సంతోష్, బైండ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 7: బీర్కూర్ మండలంలోని పలువురు పాత నేరస్తులను తహసీల్దార్ లత ఎదుట బీర్కూర్ పోలీసులు శుక్రవారం బైండోవర్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు పోవొద్దని, గొడవలు పడొద్దని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు చెప్పారు. మరోసారి గొడవలు పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

బాన్సువాడ, ఫిబ్రవరి 7: మండలంలోని ఇబ్రహీంపేట్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ అనిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తాడ్కోల్, హన్మాజీపేట్ ఉప కేంద్రాలకు సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి, సహకరించాలని కోరారు.

పంటల వివరాలు నమోదు

రాజంపేట్, ఫిబ్రవరి 7: రాజంపేట్‌లో రైతులు యాసంగిలో సాగుచేస్తున్న పంటల వివరాలను ఏఈవో శిల్ప శుక్రవారం నమోదు చేసుకున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించిన ఆమె.. సర్వే నంబరు ఆధారంగా ఆన్‌లైన్‌లో పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. రైతులు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు ఉన్నారు.

వివరాలు నమోదు చేసుకుంటున్న ఏఈవో శిల్ప

తాగు నీటి సమస్య పరిష్కరించాలి

భిక్కనూరు, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో నెలకొన్న తాగు నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి మహేశ్‌కుమార్ గౌడ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీఐ జిల్లా ప్రతినిధి గంగుల రవీందర్ మాట్లాడుతూ.. కాలనీలో కొంత కాలంగా నీటి సమస్య ఏర్పడిందన్నారు. వెంటనే పరిష్కరించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న గంగుల రవీందర్

రైతులకు ఎరువులు సకాలంలో అందించాలి

భిక్కనూరు, ఫిబ్రవరి 7: మండలంలోని పెద్దమల్లారెడ్డి సింగిల్ విండోను జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విండోలో ఉన్న స్టాక్ రిజిస్టర్, ఎరువులను తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు సకాలంలో అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఏడీఏ అపర్ణ, సీఈవో మోహన్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

బీబీపేట్/ నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 7: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో అబ్బాగౌడ్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా మండలంలోని జనగామ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీళ్లు పోశారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్‌కు సూచించారు.

నస్రుల్లాబాద్ మండలంలోని రాముల గుట్ట గ్రామంలో ఫ్రైడే డ్రై డేలో భాగంగా ఇండ్ల పరిసరాల్లో నిలిచిన నీటిని తొలగించారు. మండల ప్రత్యేకాధికారి దయానంద్, ఎంపీడీవో సూర్యకాంత్ గ్రామంలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల ఎత్తు, బరువు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార విషయాలు తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో రిజిస్టర్లను పరిశీలించారు. వారివెంట గ్రామ కార్యదర్శి మానస, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

రాములగుట్టలో నీటిని పరిశీలిస్తున్న సిబ్బంది

బిచ్కుంద పాఠశాలను పరిశీలించిన సబ్‌కలెక్టర్

ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడికి సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బిచ్కుంద, ఫిబ్రవరి 7 : 'అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాల' శీర్షికన ఈ నెల 2న 'నమస్తే తెలంగాణ 'దినపత్రికలో ప్రచురితమైన కథనానికి బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి స్పందించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రాంగణం అంతా కలియ తిరిగి ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతన భవన నిర్మాణం పూర్తయినప్పటికీ గుత్తేదారుకు బిల్లులు ఆగి పోవడంతో భవనాన్ని తమకు అప్పగించలేదని ఆయన సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బాలికల పాఠశాలలో విద్యార్థినులకు సరైన మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పాఠశాల ఆవరణలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆమెవెంట తహసీల్దార్ సురేశ్, సీనియర్ అసిస్టెంట్ కుషాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

తృటిలో తప్పిన పెను అగ్నిప్రమాదం

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 7: కాలనీవాసులు అప్రమత్తంగా ఉండడంతో పెను అగ్నిప్రమాదం తప్పింది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని లక్ష్మీటాకీసు ఎదురుగా ఉన్న అబ్దుల్లాకు చెందిన స్క్రాప్ దుకాణం భాగాన తలుపు పద్ద కాటన్లు, సంచులకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని దట్టమైన పొగలు వ్యాపించాయి. పరిస్థితిని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. స్క్రాప్‌షాప్ చుట్టూ దగ్గరగా ఇండ్లు ఉండడంతో అగ్నిమాపక సిబ్బంది రావడం ఏమాత్రం ఆలస్యమయినా ప్రమాద తీవ్రత చాలా ఎక్కువగా ఉండేదని స్థానికులు పేర్కొన్నారు.

మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మహిళా చట్టాలపై అవగాహన

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలో సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై షీ టీమ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ శుక్రవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని.. సామాన్య ప్రజలు, రైతులను గుర్తించి వారి బ్యాంకు అకౌంట్లలో ఉన్న డబ్బులు కాజేసేందుకు ప్రయత్నిస్తారన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ సక్రమంగా చేపట్టాలి

●సబ్ కలెక్టర్ కిరణ్మయి

బిచ్కుంద, ఫిబ్రవరి 7 : మండలంలోని ఆక్సిజన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన మొక్కల సంరక్షణ సక్రమంగా చేపట్టాలని పంచాయతీ అధికారులకు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలో తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆక్సిజన్ పార్క్‌ను పరిశీలించి మొక్కలు ఎండిపోవడం గమనించారు. మొక్కల సంరక్షణకు తగు జాగ్రత్తలు పాటించాలని, పిచ్చి మొక్కలు తొలగించాని సూచించారు. ఐకేపీ సెంటర్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడారు. ఆక్సిజన్ సెంటర్ పక్కన ఉన్న మినీ స్టేడియాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్పీవో నాగరాజు, తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాము తదితరులు ఉన్నారు.

మద్నూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిశీలన..

మద్నూర్, ఫిబ్రవరి 7: ఈనెల 27న జరగబోయే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మండలకేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో సబ్ కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి పరిశీలించారు. ఒక కేంద్రం పట్టభద్రులు, మరోటి ఉపాధ్యాయ ఓటర్ల కోసం ఏర్పాటు చేశామని ఆమె పేర్కొన్నారు. మండల పరిధిలో 417 మంది పట్టభద్రులు, 49 మంది ఉపాధ్యాయ ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆమెవెంట తహసీల్దార్ ముజీబ్ తదితరులు ఉన్నారు.

వదలపర్తిలో పాత హనుమాన్ ఆలయానికి దారి ఏర్పాటు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 7: మండలంలోని వదలపర్తి పాత గ్రామంలోని హనుమాన్ మందిరానికి దారి ఏర్పాటు చేసినట్లు ఆర్ఐ మహ్మద్ శుక్రవారం తెలిపారు. వదలపర్తి పాత గ్రామం పోచారం ప్రాజెక్టు కట్టిన అనంతరం తరచూ ముంపునకు గురి అవుతుండడంతో.. సమీపంలోని ఎత్తైన ప్రాంతంలో తిరిగి గ్రామాన్ని నిర్మించుకున్నారు. పాత గ్రామంలోని హనుమాన్ ఆలయం అలాగే ఉండడంతో అక్కడికి వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. గ్రామస్తులు దారి ఏర్పాటు కోసం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇవ్వడంతో పాత గ్రామమైన సర్వే నెంబర్ 95,96లో సర్వే చేపట్టినట్లు చెప్పారు. అక్కడ పట్టాలు లేవన్నారు. హనుమాన్ మందిరానికి దారి ఏర్పాటుతో పాటు ఆలయం మీదుగా ప్రాజెక్టు బ్యాంక్ వాటర్ ప్రాంతంలో పశువుల మేత కోసం దారిని గుర్తించి, గ్రామస్తులకు చూపించామని పేర్కొన్నారు. ఆయన వెంట సర్వేయర్ కరుణాకర్, జూనియర్ అసిస్టెంట్ సాయిలు, గ్రామ కార్యదర్శి నజీమొద్దీన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాత వదలపర్తి గ్రామంలో సర్వే చేపడుతున్న రెవెన్యూ సిబ్బంది

ట్యాంకు పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

లింగంపేట, ఫిబ్రవరి 7: గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకు పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో నరేశ్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని బాణాపూర్, బాణాపూర్ తండా, జగదాంబ తండా, సురాయిపల్లి, కోమట్‌పల్లి, పోతాయిపల్లి, కన్నాపూర్, పోల్కంపేట, మెంగారం తదితర గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో మల్లూరీతో పాటు గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

చిన్నారుల్లో పోషణ లోపం తగ్గించాలి

లింగంపేట, ఫిబ్రవరి 7: ఐదేండ్లలోపు ఉన్న పిల్లల్లో పోషణ లోపం నివారణ చర్యలు చేపట్టాలని ఏపీఎం చామంతి శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని సెర్ఫ్ కార్యాలయంలో వీవోఏలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఐదేండ్లలోపు చిన్నారుల్లో పోషణ లోపం అధికంగా ఉంటుందన్నారు. పుట్టిన పిల్లలకు రెండేండ్లలోపు పోషణ లోపం రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనిసెఫ్, సెర్ఫ్ సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీవోటీ జగదీశ్‌కుమార్, మోహర్, వీవోఏలు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనంలో చెట్లు నరికిన వ్యక్తిపై కేసు

గాంధారి, ఫిబ్రవరి 7: పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన చెట్లను నరికిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గాంధారి ఎస్సై ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. మండలంలోని రాంపూర్ గడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన దాదాపు 30 చెట్లను గుర్తు తెలియని వ్యక్తి ఉద్దేశపూర్వకంగా నరికాడని గ్రామ కార్యదర్శి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేశామన్నారు. అదే గ్రామానికి చెందిన పిట్ల రామయ్య చెట్లను ఉద్దేశపూర్వకంగా నరికినట్లు గుర్తించి, అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

పల్లె ప్రకృతి వనంలో నరికి వేతకుగురైన చెట్లు

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 7: గిరిజనుల అరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ జయంతి (ఫిబ్రవరి 15)ని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని లంబాడా ఐక్య వేదిక జిల్లా యూత్ ఇన్‌చార్జి అనిల్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బంజారాలను గుర్తించి, వారి గురువైన సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని, కానీ సెలవుదినంగా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఇకనుంచైనా సెలవుదినంగా ప్రకటించాలని ఆయన కోరారు.

మానవత్వం చాటుకున్న ఎల్లారెడ్డి పోలీసులు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 7: మతిస్థిమితం లేని వృద్ధురాలిపై ఎల్లారెడ్డి పోలీసులు మానవత్వం చూపి ప్రజల అభినందనలు అందుకున్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి కోర్టు కాంపౌండ్‌వాల్ పక్కన ఉన్న మతిస్థిమితం లేని వృద్ధురాలిని చూసి హృదయం చలించిన ఎల్లారెడ్డి ఏఎస్సై విజయలక్ష్మి వెంటనే వాహనం ఆపి వృద్ధురాలికి బట్టలు, ఆహారం అందించి ఆమెను ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. ఆమెవెంట కానిస్టేబుల్ ఆశ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 7: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, వారు అస్వస్థతపాలు కాకుండా చూసుకోవాలని ఎంఈవో వెంకటేశం సూచించారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, మోడల్‌స్కూల్, కేజీబీవీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే సమయంలో ఏజెన్సీ నిర్వాహకులు పరిశుభ్రంగా ఉండాలని, మెనూ ప్రకారం వంట చేయాలని, ఎటువంటి తప్పులు లేకుండా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దాన్ అల్లం మహేందర్ పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా కాపాడాలి

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 7: నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తగా కాపాడాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. శుక్రవారం ఆయన వాటరింగ్ డే సందర్భంగా బ్రాహ్మణ్‌పల్లి నర్సరీలో మొక్కలకు నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయనతో పాటు ఎంపీడీవో ప్రకాశ్ తదితరులున్నారు.

బ్రాహ్మణ్‌పల్లి గ్రామ నర్సరీలో వాటరింగ్ డే సందర్భంగా మొక్కలకు నీళ్లు పోస్తున్న ఆర్డీవో

నర్సరీని పరిశీలించిన ఏపీవో..

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 7: మండలంలోని మేజర్‌వాడి గ్రామంలోని నర్సరీని ఉపాధి హామీ పథకం ఏపీవో సాయిలు శుక్రవారం పరిశీలించారు. నర్సరీలో పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు. నర్సరీని నిర్లక్ష్యం చేయవద్దని సిబ్బందికి సూచించారు.

ప్రభుత్వ వైపల్యాలను ఎండగట్టాలి

గాంధారి, ఫిబ్రవరి 7: బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడకూడదని, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి మండలంలోని ఆయా గ్రామాల్లో పలువురు మృతిచెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి మాట్లాడారు. రాంపూర్ గడ్డ మాజీ సర్పంచ్ భాగ్యానాయక్, చెన్నాపూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ భాగయ్య, సీతాయిపల్లికి చెందిన రావుల సాయిలు, సర్వాపూర్ కన్నెబోయిన గంగారాం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రాధాబలరాం, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు అబ్దుల్ ఫారూక్, నారాయణ, బీర్కూర్ రాజు తదితరులు ఉన్నారు.